


'సమరం' శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కథా సంకలనం . . . ఫిబ్రవరి, 1985

కాలం తాలూకు ముల్లు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది!

ఆ రాత్రి మీనాక్షికి చాలాసేపు నిద్రపట్టలేదు. పక్కమీద అస్తిమితంగా కదలాడింది. క్షణాల ముళ్ళు కదలిక, ఘనీభవించిన నిశ్శబ్దం... శబ్దమై ఆమెను నిద్రపోనీయలేదు.

'తలుపేసుకో... వస్తాను' బయటకు వెళుతూ భర్త పలికిన మాటలు పదేపదే గుర్తుకు వస్తున్నాయి. ఒళ్ళు మండిపోతోంది. ఊరు నిద్రకు ఉపక్రమించిన వేళ 'తలుపేసుకో... వస్తాను...' అంటే?

ఉదయం భర్త గుడ్డలు సర్దుతూ బీరువాలో సెంటుబాటిలు చూసి ఆశ్చర్యపోయింది మీనాక్షి. మంత్రత గొలిపే అటువంటి సెంటు తానెప్పుడూ చూడలేదు.

కొత్త అలవాటు... దేనికి నాంది?

సమయం గడచీ గడచీ ఆమెకు కళ్ళు మూతలు పడుతున్నాయి. తలుపున చిరుశబ్దం, అలవాటయిన సవ్వడి! కనురెప్పల్ని నలుపుకొని లేచి తలుపు తీసింది మీనాక్షి.

భర్త..!

మల్లెలు, సెంటు కలగలిపిన వింత వాసన..!!

పట్టాభి లోపలికి రాగానే తలుపేసింది. ఆ వాసన గది అంతా ఆవరించుకొంది. మామూలుగా అయితే అది బాగానే ఉంది.

కానీ, మీనాక్షిలో అసహ్యం... ఏహ్యాభావన! హాల్లో లైటు ఆర్పి, మంచినీరు త్రాగి పడకగదికి వచ్చేసరికి పట్టాభి నిద్రపోతూ కన్పించాడు. ఒక్కక్షణం అలా చూసి, భర్త మంచాన్ని ఆనుకొని ఉన్న తన మంచాన్ని దూరంగా లాక్కొంది మీనాక్షి.

అగ్రహారంలో నారాయణమూర్తిది సాంస్కృతిక సాంప్రదాయాలు జతకలసిన శ్రోత్రియ కుటుంబం! ముగ్గురు ఆడపిల్లల తరువాత కడసారి కాన్పులో కొడుకు పుట్టాడు. మీనాక్షి పెద్దది. ఊరిలో ఎవరికి ఏ ఆపద వచ్చినా నేనున్నానని ఆదుకొనే నారాయణ అందరిలోనూ తలలో నాలుకలా మంచిపేరు సంపాదించుకున్నాడు.

పాతిక ఎకరాల మాగాణికి ఏకైక వారసుడు! సంతానాన్ని కుదించుకుందామనే సామాజిక స్పృహ ఉన్నా- మగపిల్లవాడి కోసం ఎదురుచూసి ముందు ముగ్గురు ఆడపిల్లల్ని కన్నాడు. అందరిలాగే కొడుకును పట్నం పంపి బాగానే చదివించాడు.

కూతుళ్ళను మటుకు ఉన్నంతవరకు పల్లెటూరులో వానాకాలం చదువులు చదివించి చేతులు దులుపుకున్నాడు. మీనాక్షికి పెద్ద డిగ్రీలు లేవు కానీ- రామాయణం, భారతాలు చదవడం వచ్చు. లోకజ్ఞానం బాగా తెలుసు.

చదువుకోవాలనే ఆశ, ఆశయం ఉన్నా ఆడపిల్లను ఊరు దాటనీయని కారణాన- ఉన్న ఊరులోనే ఏడవ తరగతిలోనే చదువు ఆపవలసిన స్థితి ఏర్పడింది.

"ఏమిట్రా నారాయణా! బోడ్డూడని పిల్లకు అప్పుడే పెళ్ళి ప్రయత్నమేమిట్రా?!" పొలం ఊడ్పుల కోసం మంచిచేసి, ధాన్యాన్ని నీటిలో నానబెడుతున్న కొడుకును నిలదీసింది సుగుణమ్మ.

"బాగుందే అమ్మా! పార్వతికి అంటే లోకం పోకడ తెలీదు- నీకేమి వచ్చిందే? పెద్దమనిషి కాని పిల్ల కావాలని వెతుక్కుంటూ మనింటికి వచ్చాడు వీరభద్రం. నీకు ఎనిమిదేళ్లప్పుడు పెళ్ళి

జరిగింది. నా భార్య పదకొండేళ్లకు కాపురానికి వచ్చింది! మీనాక్షికి పదమూడు!!" తల్లి మాటల్ని కొట్టిపారేశాడు నారాయణ.

"ఆ వీరభద్రం సామాన్యుడేమీ కాదు. ఏభై ఎకరాల కొబ్బరి తోట, మాగాణి... కాళ్ల దగ్గరికి వచ్చిన సంబంధం!" తల్లి ఏవేవో గొణుక్కుంది. భార్య ఇంకాస్త ఆగమంది. అవేమీ చెవికి ఎక్కలేదు నారాయణమూర్తికి. 'పట్టాభికి పొలం, పుట్రా ఏమీ కొదవలేదు. భార్యను చక్కగా చూసుకోగలడు!' తన మాటే నెగ్గించుకున్నాడు నారాయణ.

పట్టాభి ఇంట్లో అడుగుపెట్టింది మీనాక్షి. ఆ ఊరు కన్నా చదువు మెరుగ్గా ఉంటుందని తమ్ముడిని తన దగ్గరకు తెచ్చుకొంది.

"అన్నం పెట్టి చాలాసేపయింది!" తమ్ముడు రాంబాబుని కేకేసింది మీనాక్షి.

అలికిడి ఎంతసేపటికీ లేకపోయేసరికి హాల్లోకి వచ్చింది మీనాక్షి. పుస్తకాల మీద తలపెట్టి కళ్ళనీళ్లతో ఉన్న తమ్ముణ్ణి చూసింది.

"ఏమిట్రా కన్నీళ్లు... ఏమయిందట?"

తల నిమురుతూ అక్క అడిగేసరికి బావురుమన్నాడు పదిహేనేళ్ల రాంబాబు.

మీనాక్షి మాట్లాడలేదు... కొన్ని క్షణాలు అలాగే ఏడ్చాడు.

ఆ ఏడుపు సన్నపడింతర్వాత "ఏం జరిగింది?" సముదాయిస్తూ అడిగింది.

తలత్రిప్పి చటుక్కున అక్క ముఖంలోకి సూటిగా చూశాడు. ఆవేశం తన్నుకొస్తోంది.

"ఇది... ఇది... ఇది నీకు తెలుసా అక్కా?! బావ... ఆ కనకవల్లితో తిరుగుతున్నాడు. మా ఫ్రెండ్సంతా హేళన చేస్తూ, ఎగతాళిగా మాట్లాడుతున్నారు!"

మీనాక్షికి సెంటు బాటిల్... 'తలుపేసుకో వస్తాను...' నలిగిపోయిన మల్లెపూల వింత వాసన... గుర్తుకువచ్చాయి.

కనకవల్లి అంటే... కనకవల్లి రాత్రి కథకు నాయిక అన్నమాట! రాంబాబు వేదన మీనాక్షికి అర్థమయింది. బావంటే రాంబాబుకి ఎంత ఇష్టమో తనకు తెలుసు.

"లోకులు కాకులు! 'కావ్... కావ్...'మంటూ ఎగురుతూ, కూస్తూ ఉంటారు. నిజం ఈషన్మాత్రం ఉండదు. మీ బావను గూర్చి నీకు తెలియదా? ఆయన నిప్పు! అన్నం తిందువుగాని రా!!" చీరచెంగుతో రాంబాబు కళ్ళు తుడుస్తూ అంది.

రాంబాబు అక్కను నమ్మాడు... అన్నానికి కూర్చున్నాడు.

'నిప్పుకు చెద పడుతుందా?!' మీనాక్షి కొత్త సమీకరణాలు చేసుకోవాల్సివచ్చింది. తమ్ముడు రాంబాబును సమాధాన పరచగలిగింది. కానీ, భరద్వాజను..?

"నేనీరోజు నుంచి స్కూలుకు పోను. ఊహుఁ... స్కూలుకే కాదు- బయటికే పోను!"

"ఏం..?!" అంది మీనాక్షి నవ్వుతూ. కొడుకు అలక ఆమెకు కొత్తకాదు.

"ఏ మొహం పెట్టుకొని వెళ్లను?!"

"ఈ మొహం బాగానే ఉంది కదరా!" భరద్వాజ ముఖాన్ని ప్రేమగా చేతుల్లోకి తీసుకుంటూ అంది.

"జోకులు వద్దమ్మా! నీకు తెలిసిందా నాన్న సంగతి?!"

"కొత్తగా తెలిసేదేముంది? పదిహేడేళ్ల నుండి సహవాసం చేస్తున్న మనిషే కదా!"

"నోc..." లేచినుంచొని పౌరుషం నిండిన స్వరంతో నడుము మీద చేతులు ఉంచుకొని తల్లి ముఖంలోకి తీక్షణంగా చూస్తూ అన్నాడు –

"నీకంతా తెలుసన్నమాట!"

మీనాక్షికి అర్థమయింది... తమ్ముడు రాంబాబు కళ్ళనీళ్లతో అడిగాడు– కొడుకు భరద్వాజ కాలుతూన్న కళ్ళతో నిలేశాడు.

"నాకు తెల్సినదాంట్లో నువ్వంత నిప్పులతో అడగాల్సింది ఏమీ లేదే!"

"నేనడుగుతున్నది కనకవల్లి అనే నిప్పు గురించి! ఊరంతా అనుకుంటూన్న దాని గురించి అడుగుతున్నావా?!"

"అదంతా అబద్ధం!"

"ఊరంతా అన్నా నేను నమ్మేవాణ్ణి కాదమ్మా! ఆచారి తెలుసు కదా... నా స్నేహితుడు– నిన్నరాత్రి పదిగంటలకు నాన్న ఆ ఇంట్లోకి పోవడం చూశాడు!"

"......................"

తమ్ముడికీ, కొడుక్కీ తెలిసిన తర్వాత మీనాక్షికి అర్థమైపోయింది... అది నిజమని! చిన్నప్పుడు నాయనమ్మ మీనాక్షితో ఓ విషయం చెప్పింది... 'అలవికాని దుఃఖం, బాధ నిన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తూంటే గీత చదువు– నీ మనసు సానుకూల పడుతుంది... నీ ధర్మమూ నీకు తెలుస్తుంది!" అంటూ తన దగ్గర ఉన్న భగవద్గీతను అత్తగారింటికి వెళుతూన్న మీనాక్షికి ఇచ్చింది.

గదిలోకి వెళ్లి తలుపేసుకొంది మీనాక్షి. గీత పుటల్లోకి వెళ్లిపోయింది.

**'ఉద్ధరే దాత్మ నాత్మానాం నాత్మానమవ సాదయేత్ ।**
**అత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైన రిపురాత్మనః ॥'**

మూఢమైన మనసుతో ఉండకు. రోజురోజుకీ బావిలో కప్పవైపోతున్నావు. తప్పు చేస్తే భర్తనైనా చొక్కా పట్టుకు నిలదీసే రోజులివి.

"......................"

"నువ్వు నాన్నను నిలేస్తావా... లేదా?!"

"......................"

"నువ్వు చెప్పు... లేకపోతే నేను మాట్లాడతాను"

భరద్వాజ కళ్ళలోకి చూసింది మీనాక్షి. 'అంత చిన్నవయసులో వాడికి ఎంత పౌరుషం?' ఒకింత గర్వంగా ఫీలయింది.

"ఆ పని ఆయనకు కొడుకుగా నువ్వు చెప్పొచ్చుగా..!"

భరద్వాజ మాట్లాడలేదు. తల్లి దగ్గర దర్పం... అంతే! తండ్రిని చూస్తే తోక ముడుస్తాడు. ఈరోజుల్లో చాలామంది మగాళ్ళకి అదే యావ! పందుల్లా, కుక్కల్లా తిరుగుతూ సాయంత్రం అయ్యేసరికి 'టీ' సెంటర్లో ఏ ఇద్దరు చేరినా– ఆడదాని శరీరం గురించే, జీవితంలో అంతకుమించి ఏమీలేనట్లు కక్కుర్తిపడి ఛస్తారు.

సుకుమారమైన శృంగారాన్ని బజారుపాలు చేస్తున్నారు. విచ్చలవిడి ప్రవర్తనలతో రచ్చకీడుస్తున్నారు. పెళ్ళాంపిల్లలు, ఇంటి అవసరాల కంటే కూడా అలాంటి చౌకబారు ఆలోచనలకి అలవాటు పడిపోయి అందమైన జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు.

అయినా- ఆ కనకవల్లికయినా బుద్ధి ఉండొద్దూ..?!

ఒఠ్ఠి బజారుమనిషి!

కనబడిన ప్రతివాడినీ లొంగదీసుకొని ఎంతమందితో రాచకార్యాలు నడుపుతోందో..!? ఆ... అయినా ఏంచేస్తుందిలే... 'అందం, చందం' అంటూ పైటజారేసి ఎంతమంది మగాళ్ళని ముగ్గులోకి లాక్కుందో..! బ్రతుకు దరిద్రం అలా దిగజార్చి పడేసినప్పుడు కనకవల్లి అయినా... వెండివల్లి అయినా ఒక్కటే!

– మీనాక్షి హృదయం రగిలిపోతోంది.

"తలుపేసుకో... వస్తాను..."

"కొత్తగా అలవాటులేని పని... పగటికి ఏమైంది!"

"కొన్ని కార్యాలు చీకట్లోనే బాగుంటాయి..."

"చీకటి తప్పులు!"

"......................"

"నా చూపులకి తల వంచుకోనక్కరలేదు... ఆ కనకవల్లి దగ్గరికే కదూ!"

"......................"

"కనకరాజు రాత్రికి పట్నంతో పోయాడంది సుమతి!"

"ఈ కనకం వాడి బాపతు కాదు... అది వేరే ఆడది!"

"పొద్దున్న బీరువాన సెంటుబాటిల్ చూసినప్పుడే అనుమానమొచ్చింది!"

"సమయం మించిపోతోంది... సమాధానం రేపు చెప్తా!"

దినం దినం పట్టాభి తలుపేసుకోమంటున్నాడు. తర్వాత నిద్రపోతూన్న మీనాక్షి సవ్వడి విని లేచి తలుపు తీస్తూనే ఉంది.

మీనాక్షి మంచం దూరంగానే ఉంది. పట్టాభి మంచాన్ని దరి చేర్చమనలేదు.

కనకవల్లి పొందు పట్టాభికి సుఖంగానే ఉంది.

"ఆరోగ్యం జాగ్రత్త!" చపాతీ తింటూన్న పట్టాభితో చిలికిన మజ్జిగ గ్లాసును ప్రక్కనుంచుతూ పలికింది మీనాక్షి.

"కొత్తగా ఈ పాఠాలేమిటి?"

"రాత్రి సమయం కదా... పురుగూ, పుట్రా..."

భార్య దేనిగురించి అంటూందో పట్టాభికి అర్థమయింది.

"అన్నట్లు మరిచాను... సాయంత్రం వీరిగాడు టౌను నుండి వస్తూ మీరేదో తెమ్మన్నారని ఈ ప్యాకెట్ ఇచ్చాడు!" అంటూ బల్లసొరుగులో ఉంచిన ప్యాకెట్‌ని తీసి చొక్కా వేసుకుంటూన్న భర్తకు ఇచ్చింది మీనాక్షి.

ప్యాకెట్ జేబులో పెట్టుకున్నాడు.

"చూశావా..!" ఎటో చూస్తూ పలికాడు పట్టాభి.

తడుముకొంది మీనాక్షి...

"పిల్లలాడుకొనే బుడగలే కదా!"

"హెచ్.ఐ.వి. ఇనీషియల్ స్టేజ్ కేసెస్ ఈమధ్య మరలా ఎక్కువవుతున్నాయి!"

– డాక్టర్ శంకరం అన్న మాటలు విని చిన్నగా నవ్వుకున్నాడు పట్టాభి.

పట్టణంలో శంకరం డాక్టరు పట్టాభివాళ్ళకి ఫ్యామిలీ డాక్టరు.

"వెధవ పనులు చేసినప్పుడు కూడా జాగ్రత్తలు తీసుకోకపోతే ఇలాగే ఉంటుంది మరి!"

"......................"

"మొన్న ఎవరో అమ్మాయి వచ్చింది... చాలా అందంగా ఉంది. మనిషిని చూస్తే చాలా ఇన్నోసెంట్‌గా తోచింది. భయపడుతూ చెకప్‌కి వచ్చింది. టెస్ట్ చేశాను. హెచ్.ఐ.వి. ఇనీషియల్ స్టేజ్‌లో ఉంది. పేరు, ఊరు అడిగాను... చెప్పలేదు."

'అవును... కనకవల్లి కూడా చాలా అందంగా ఉంటుంది. చాలా ఇన్నోసెంట్‌గా ఉంటుంది మరి! ఆ ఇన్నోసెన్సీని అడ్డంపెట్టుకొని ఊరు ఊరంతా దోచుకుంటున్నారు ఆమెను. అయినా ఈ మనిషి చెప్పే మనిషి ఆమె అయిఉండదుగా!' పట్టాభి మనసు పరిపరి విధాల పోతోంది.

ఎప్పుడూ లేనివిధంగా ఈమధ్య కనకవల్లి ఏదో వంకన అస్తమాను పట్టణానికి పోతోంది. పట్టాభికి లోలోపల గుబులుగా ఉంది. పైకి కన్పించనీయకుండా జాగ్రత్తపడ్డాడు.

"ఎంతో మందికి ట్రీట్‌మెంట్ ఇస్తుంటాను. కానీ, ఆ అమ్మాయిని చూస్తే చాలా జాలి అనిపించిందిరా! నిండా ముప్పై ఏళ్లు కూడా ఉండవు. ఆర్థికంగా పెద్ద ఉన్నదానిలా కన్పించదు."

శంకరం ఆ అమ్మాయి గురించి చెబుతూంటే పట్టాభి ముఖంలో రంగులు మారుతున్నాయి.

ఎందుకైనా మంచిదని టౌను దాటి వెళ్లి మరో డాక్టరు దగ్గర టెస్ట్ చేయించుకున్నాడు పట్టాభి. తనకేమీ లేదని డాక్టరు సర్టిఫై చేసినతర్వాతగాని కుదుటపడలేదు తాను.

తలుపు తీసింది కనకవల్లి!

సాధారణంగా ఎవరైనా వచ్చి తలుపు కొడితే– తల్లి, చెల్లెలు ప్రక్కగది లోకి తప్పుకుంటారు. తమ్ముడు సూర్యం ప్రక్క ఊరు వెళ్లి రోజూ చదువుకొస్తుంటాడు.

రోజులాగే వాళ్ళు పట్టాభిని చూసి తప్పుకున్నారు. కనకం పట్టాభికి ఇష్టమైన తెల్లచీర కట్టుకొని ఉంది. రోజుకన్నా అందంగా కనిపిస్తోంది. మంచి అందాలతో మెరిసిపోతోంది. జడలోని మల్లెపూల వాసన అప్పటికే గదినిండా పరుచుకొని గుబాళిస్తున్నాయి. వాటితోపాటు ముఖంనిండా నవ్వులు పులుముకొని చిక్కటి స్వచ్ఛమైన పాలగ్లాసును తీసుకొని వచ్చింది. అది నిత్య తతంగం.

"ఇది నిజమేనా..? డాక్టర్ శంకరం నీకు ఎన్నాళ్లనుంచి పరిచయం?"

"ఏ శంకరం..?" తొట్రుపాటు అణచుకుంటూ అంది.

"నీకు బ్లడ్‌టెస్ట్ చేసి రిజల్ట్ చెప్పిన డాక్టరు!"

ఆమె మౌనమే అంగీకారమయింది. గొంతుపెంచబోతున్న పట్టాభిని కనకవల్లి వారించింది.

"ఇది మీకు చెప్పాలనే నా తాపత్రయం! కానీ, ఆ మాట ఇలా చెబితే మీరు నమ్మరని తెలుసు... అందుకే!' అంటూ జాకెట్‌లోంచి మడిచిన కాగితం తీసి ఇచ్చింది.

చదువుతూన్న పట్టాభి ముఖంలో రంగులు మారుతున్నాయి. ఆమెకు ఎయిడ్స్ వ్యాధి సోకిందన్న నిజం అతన్ని కృంగదీస్తోంది. క్రమంగా ఓ జుగుప్స... ఓ ద్వేషభావం... ఆమె మీద అనాసక్తి... భయం తాలూకు అంశమేదో పట్టాభిని పట్టుకొని అతలాకుతలం చేస్తోంది.

ఆ ఉత్తరాన్ని అక్కడే చించిపడేసి, విసురుగా లేచి వెళ్లిపోయాడు.

"సెలవు లేకుండా వచ్చావేం?!" హఠాత్తుగా వచ్చిన తమ్ముడు సూర్యంని ఆశ్చర్యంగా చూస్తూ అంది కనకవల్లి.

"నే విన్నది నిజమేనా?!" సూటిగా అక్క కళ్ళలోకి చూస్తూ అడిగాడు.

కనకం గుండె లయ తప్పింది –

"ఏమి విన్నావ్..?" బలహీనంగా అడిగింది.

"ఊరంతా కోడై కూస్తున్న మాట! నువ్వు 'అన్ టచ్‌బుల్' అనే విషయం!"

కనకవల్లి నోట మాట రాలేదు. ఇలా అయినవాళ్ళ ముందర తలవంచుకు నిలబడాల్సిన రోజు వస్తుందని ఆమె ఆలోచించలేదు.

"వినటానికి అసహ్యంగానూ, నిజం చెప్పాలంటే నిన్ను చూడాలంటే ఇబ్బందిగానూ ఉంది!"

ఆ క్షణం వరకూ తాను ఒళ్ళు అమ్ముకొని పంపిన డబ్బుతో చదువుకుంటూన్న తమ్ముడు ఇలా ఎదుట నిలబడి ప్రశ్నించడం... అనుకోని పరిణామం కనకవల్లికి.

తల్లి, చెల్లెలు కూడా వాడితో శృతి కలిపారు. ఇప్పుడు తాను వాళ్ళకు అక్కరలేని వస్తువు.

ఊరిలోని మనుషులతో సమానంగా రక్తసంబంధీకులు కూడా దూరమైపోవడం ఆమెకు మింగుడు పడటంలేదు.

●

"పది అవుతూ ఉంది!"

– వరండాలో వాలుకుర్చీలో విశ్రాంతిగా కళ్ళుమూసుకొని భర్తను చూస్తూ అంది మీనాక్షి.

"అంటే..?!" అర్థంకానట్లు భార్యకేసి చూశాడు.

"నిద్ర వస్తోంది... మీరు బయటకు వెళితే తలుపేసుకుందామని!"

పట్టాభి బయటకు వెళ్లే జాడ ఏమీ కనిపించడంలేదు.

"ప్రపంచంలో సీత ఒక్కతే అదృష్టవంతురాలు. అందరూ రాముళ్ళు కారు!" కనకవల్లి మోజులో పడి కొట్టుకుంటూన్న రోజుల్లో పట్టాభి చెప్పిన నీతులు గుర్తుకువచ్చి మీనాక్షి హృదయం అతలాకుతల మవసాగింది.

కనకవల్లి ఎయిడ్స్ బారిన పడిందన్న విషయం అందరికీ తెలిసిపోయింది. ఊరంతా గబ్బు అయిపోయింది. దేశం అంతా ఎయిడ్స్ గురించి తెలిసినా ఆ అగ్రహారంలో అది మొదటి కేసు కావడం యాధృచ్ఛికం! ఆమె పొందుకోసం వెంపర్లాడిన వారందరూ వైద్యపరీక్షల కోసం ఒకరికి తెలియకుండా మరొకరు పట్నం వైపు పరుగెత్తసాగారు.

ఊరు కనకవల్లిని వెలేసింది. ఆమె తల్లి, చెల్లి, తమ్ముడు కూడా మినహాయింపు కాకపోవడం విడ్డూరం. ఊరిపెద్దలు ఆమెను అగ్రహారం వదిలి వెళ్లిపోవాలని తీర్మానించారు.

ఒకప్పుడు దాని క్రీగంట చూపుకోసం అల్లల్లాడిన జనానికి– నేడా చూపు తగిలితేనే 'పులిరాజు'ను కావలించుకున్నంత భయంగా ఉంది.

పట్టాభితో సహా అందరూ కనకవల్లిని ఊరిలోంచి తన్ని తరిమెయ్యడానికి పథకం రచిస్తున్నారు. తనవాళ్ళు ఆమెను వదిలి వెళ్లిపోయారు.

"దీని సంగతి ప్రక్క ఊళ్లకు కూడా తెలియజేయాలిరా! లేకపోతే ఎవడో చేరదీసి మునిగిపోతాడు!" పంచాయితీ ప్రెసిడెంట్ పంచాయితీ పెట్టి చెబుతున్నాడు.

ఇంతమంది జనం ముందు వంటరిదై... తాను నుంచున్న నేల క్రుంగిపోయి చనిపోతే బాగుండుననుకుంటోంది ఆమె. తననూ, తన శరీరంలోని మాంసపుముద్దల్నీ తినిపడేసిన పట్టాభి అయినా ఆదరిస్తాడేమోనని ఆశగా ఎదురుచూస్తోంది. తనకేమీ పట్టనట్టు జనం వెనుక నిలబడి ఉన్న అతన్ని చూస్తూంటే ఏడుపు తన్నుకొస్తోంది ఆమెకు.

విషయం అంతా గ్రహిస్తూనే ఉంది మీనాక్షి! ఓ వైపు భర్తలో మార్పు తనకు సంతోషం కలిగిస్తున్నా- సాటి ఆడదానిగా ఆ హృదయవిదారక దృశ్యం కలవరాన్ని కలుగజేస్తోంది. శారీరక వాంఛలను తృప్తి పరచుకోవడం కోసం అంతా పశువుల్లా ప్రవర్తించారేగాని- ఒక్కరూ మంచి హృదయంతో కనకవల్లి పరిస్థితికి స్పందించకపోవడం చాలా బాధగా అన్పిస్తోంది.

'ఆమె పతనంలో వీళ్ళందరికీ భాగస్వామ్యం ఉందికదా..!' ఆలోచిస్తూన్నకొద్దీ మీనాక్షి మనసు ఆర్ద్రమవుతోంది. ఆమె మనసులో ఏ మూలో నిద్రాణమైవున్న కాసింత కనికరపు భావన ఏదో మేల్కొంటోంది. ఆ పురాతనమైన మనిషికి ఆపన్నహస్తం ఇవ్వాల్సిన సమయంలో ఆదుకునేందుకు సిద్ధపడుతోంది. సాటిస్త్రీగా తాను ఆ విధివంచితకు ఆమాత్రం తోడ్పడలేదా?!

తండ్రిని క్షమించిందని ఇన్నాళ్లూ పిల్లలు తనను అసహ్యించుకున్నారు. కానీ, ఇప్పుడు భర్తను క్షమిస్తే నేరం అవుతుంది.

'అసలు సహాయం చేస్తే తప్పేంటి?!' అనుకుంటూన్న ఆమెలో ఒక స్థిరమైన భావనేదో రూపుదిద్దుకుంటోంది. దూరంగా తమకేసే నడుచుకుంటూ వస్తూన్న మీనాక్షిని చూసి ఉలిక్కిపడ్డాడు పట్టాభి.

ఆమె నోట ఆ మాటల్ని విన్న ఊరంతా అవాక్కయిపోయింది.

"అలా చేయాలనుకుంటే నీకు కూడా ఊరి బహిష్కరణ తప్పదు... ఆలోచించుకో!" ప్రెసిడెంటుగారు సెలవిచ్చారు.

"కనకవల్లి పతనంలో అందరూ భాగస్వాములే! ఆమె అగ్రహారానికి భారమవడం విడ్డూరంగా ఉంది. కానీ, సాటి ఆడదానిగా నేను బరువు అనుకోవడం లేదు. మా నాన్న పసుపుకుంకుమల క్రింద ఇచ్చిన ఆరు ఎకరాల పొలం... దానిపైన వచ్చే మక్తాతో ఈ విధివంచితను ఆదరింప దల్చుకున్నాను. మమ్మల్ని మీరు వెలివేయడమేమిటి? ...మేమే మిమ్మల్ని వెలివేస్తున్నాము!" దృఢచిత్తంతో అంది మీనాక్షి.

ఆ పురాతన మనిషి మాటలలోని నిజాయితీకి అక్కడ మౌనమే సమాధానమయింది.

శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ సంకలనం